
సాక్షి నంద్యాల

బుధవారం । 29 । మే । 2024

పరివార దేవుళ్లకు పూజలు



శ్రీశైలంటెంపుల్: ఆలయ ప్రాంగణం లోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుని కి, శ్రీశైల క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన శ్రీబయలు వీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా అధికారులు, అర్చకులు పూజలను నిర్వహించారు.



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై మంగళవారం సికింద్రాబాద్‌కు చెందిన ఎస్ఎస్ జీవన బృందం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



మహానందిలో భక్తుల రద్దీ

మహానంది: మహానందీశ్వరుడిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వార్లను దర్శించుకుని అభిషేకాలు నిర్వహించుకున్నారు.

న్యూస్‌రీల్

మద్దిలేటయ్య హుండీ ఆదాయం రూ.59.57 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురం శివార్లో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి హుండీ ఆదాయం రూ. రూ.59.57 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈఓ రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు. స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలు, ముడుపులను దేవదాయశాఖ అధికారి చక్రభరత్ పర్యవేక్షణలో మంగళవారం లెక్కించారు. 63 రోజులకు సంబంధించిన హుండీ లెక్కింపు చేపట్టగా రూ. 59,57,000 నగదు, 72 గ్రాముల బంగారం, 3.900 కిలోల వెండి వచ్చింది. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు కృష్ణారెడ్డి, సుశీల, వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ్ చక్రవర్తి, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఐదో తరగతిలో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్


నంద్యాల(న్యూటౌన్): 2024–25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో మిగిలిన 26 సీట్ల భర్తీకి బాలికలకు ఈ నెల 29న స్థానిక దిన్నెదేవరపాడు స్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీట్ల భర్తీకి ఎస్సీ విద్యార్థులు 20 నుంచి 19 మార్కుల వరకు, ఎస్టీ అభ్యర్థులు 19 నుంచి 18 మార్కుల వరకు, బీసీలు 44 నుంచి 43 మార్కుల వరకు, ఓసీ అభ్యర్థులు 35 నుంచి 34 మార్కులు సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఈ నెల 27న వెయిటింగ్ జాబితాలో ఉన్నవారు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. వీరికి సీటు కేటాయించిన అనంతరమే ప్రతిభ ఆధారంగా మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. కౌన్సెలింగ్ 1:3 నిష్పత్తిలో ఉంటుందని, హాజరైన ప్రతి ఒక్కరికీ సీట్లు లభించే అవకాశం లేదని ఆమె స్పష్టం చేశారు.

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): పదవ తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా జిల్లాలో మంగళవారం గణితం పరీక్ష ప్రశాంతంగా కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య సజావుగా నిర్వహించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 27 పరీక్ష కేంద్రాల్లో 4,969 మంది విద్యార్థులకు గాను 2,442 మంది పాల్గొని 49 శాతం పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. 2,527 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 13 పరీక్ష కేంద్రాలను సందర్శించారన్నారు.

☛ అలాగే ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో మ్యాథ మ్యాటిక్స్, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు 5,467 మంది విద్యార్థులకు గాను 5234 మంది హాజరు కాగా 233 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ సునీత మంగళవారం తెలిపారు. అలాగే వొకేషనల్ విద్యార్థులు 294 మందికి గాను 275 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలకు 1,274 మందికి గాను 1,213 మంది హాజరు కాగా 61 మంది గైర్హాజరైనట్లు సునీత తెలిపారు. వొకేషనల్ విద్యార్థులు 128 మందికి గాను 121 మంది హాజరు కాగా 7 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేసినట్లు ఆమె తెలిపారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి



కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా కార్డియోథొరాసిక్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వైద్యశాఖ సెక్రటరీ డాక్టర్ మంజుల డి.హోస్మాని జీవో ఆర్‌టీ.352 ద్వారా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ)అప్పజెబుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ కానుండటంతో ఈ ఉత్తర్వులు ఇచ్చారు. కర్నూలు మెడికల్ కాలేజీలోనే విద్యాభ్యాసం చేసిన డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ఇక్కడే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు. కొంత కాలం పాటు విశాఖపట్టణంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2016 నుంచి మళ్లీ ఇక్కడకు వచ్చి ప్రొఫెసర్‌గా, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు.

పాఠ్య పుస్తకాలొచ్చేశాయ్..!

- పాఠశాలల పున:ప్రారంభానికి ముందే జిల్లాకు చేరిన పాఠ్య పుస్తకాలు
- మొదటి విడతలో జిల్లాకు 5.44 లక్షల కేటాయింపు
- ఒకటి నుంచి ఏడవ తరగతి వరకు జిల్లా స్టాక్ పాయింట్‌కు చేరిక
- 8 నుంచి పదో తరగతి వరకు నేరుగా మండల పాయింట్లకు సరఫరా
- పంపిణీకి సిద్ధమవుతున్న విద్యాకానుక



ఎంఆర్‌సీకి చేరిన పాఠ్యపుస్తకాలు

స్టాక్‌పాయింట్‌లో సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు



కోవెలకుంట్ల: ఓ వైపు ఎన్నికల ఫలితాల హడావుడి నెలకొన్నా మరో వైపు వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు పునఃప్రారంభం రోజే విద్యార్థులకు విద్యా కానుక అందించేందుకు అధికారులు అంతా సిద్ధం చేస్తున్నారు. పకడ్బందీ ప్రణాళికతో ముందుగా స్టాక్ పాయింట్లకు పాఠ్యపుస్తకాలను చేరవేస్తున్నారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బెల్ట్‌లు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, బ్యాగ్‌తో కూడిన విద్యా కానుక అందించేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. విద్యాభివృద్ధికి పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2024 సార్వత్రిక ఎన్నికల సమరం కొనసాగుతున్నా పేద విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి చూపుతూ ఈ విద్యా సంవత్సరం పిల్లలకు అవసరమైన పుస్తకాలను సమకూర్చారు. 2024–25 విద్యా సంవత్సరం జూన్ 12వ తేదీ నుంచి ప్రారంభం కానుండగా పాఠశాల తెరిచిన రోజే ప్రతి విద్యార్థికి విద్యాకానుక అందించేందుకు ఇప్పటికే చర్యలు ముమ్మరం అయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి తొలి విడతకు సంబంధించి 5.44 లక్షల పుస్తకాలు కేటాయించారు. నంద్యాల జిల్లాలోని 29 మండలాల్లో 1,127 ప్రాథమిక, 352 ప్రాథమికోన్నత, 478 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించేందుకు 19.70 లక్షల పుస్తకాలు అవసరం కాగా మొదటి విడతగా 1,67,601 పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయి.

విద్యాకానుక సిద్ధం..

విద్యారంగానికి పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019వ సంవత్సరం నుంచి ఏటా విద్యార్థులకు విద్యాకానుక కిట్లను సరఫరా చేస్తోంది. జిల్లాలో 1,957 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుండగా ఆయా పాఠశాలల్లో 3.22 లక్షల మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్య నభ్యసిస్తున్నారు. వీరందరికి విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలతోపాటు విద్యా కానుక కిట్లను సరఫరా చేస్తున్నారు. కిట్టులో నోట్ పుస్తకాలతో పాటు బూట్లు, బెల్ట్, యూనిఫాం , బ్యాగ్ ఉంటుంది. విద్యా సంవత్సరం మధ్యలో బ్యాగ్ చిరిగిపోతే ఆ స్థానంలో మరో కొత్త బ్యాగ్ ఇస్తున్నారు. ఐదవ తరగతి నుంచి ఆరవ తరగతికి ప్రమోట్ అయ్యే విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను అందిస్తారు. పాఠ్యపుస్తకాలు ఇప్పటికే మండల కేంద్రాలకు చేరుతుండగా విద్యాకానుక కిట్ల సరఫరాకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.



కొలిమిగుండ్లకు చేరిన పాఠ్యపుస్తకాలు

ఆర్టీసీ కార్గోలో పుస్తకాల సరఫరా..

ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను స్టాక్‌పాయింట్ నుంచి ఆర్టీసీ కార్గో వాహనాల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి కర్నూలులో స్టాక్‌పాయింట్ ఏర్పాటు చేశారు. 1 నుంచి 7వ తరగతి వరకు జిల్లా స్టాక్‌పాయింట్ నుంచి నేరుగా పాఠశాలలకు, 8, 9,10 తరగతికి సంబంధించి నేరుగా మండల స్టాక్ పాయింట్లకు సరఫరా చేస్తున్నారు. జిల్లాలోని నంద్యాల మండలానికి అత్యధికంగా 16,273 పాఠ్యపుస్తకాలు, డోన్‌కు 12,941, బనగానపల్లెకు 9.048, ఆళ్లగడ్డకు 8,404, బేతంచెర్లకు 8,349. నందికొట్కూరుకు 7,609, ప్యాపిలికి 7,592, ఆత్మకూరుకు 6,920, రుద్రవరానికి 6,477, చాగలమర్రికి 6,378, శిరువెళ్లకు 6,117, కోవెలకుంట్ల మండలానికి 3,987 పాఠ్యపుస్తకాలు మంజూరయ్యాయి. ఆయా మండలాలకు ముందస్తుగా కేటాయించిన షెడ్యూల్ ప్రకారం పుస్తకాల సరఫరా అవుతున్నాయి. పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాన్ని ఒకవైపు తెలుగు, మరోవైపు ఇంగ్లిష్ మాధ్యమాల్లో ముద్రించారు. ఎనిమిది నుంచి 10వ తరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్‌లో ముద్రించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి జిల్లాలోని ఆయా పాఠశాలలకు రెండు, మూడు విడతల్లో పూర్తి స్థాయిలో పుస్తకాలు సరఫరా కానున్నాయి. ఒకటవ తరగతి నుంచి ఐదో తరగతి వరకు పాఠ్యపుస్తకాలతోపాటు వర్క్‌బుక్‌లు, ఆరు నుంచి పదవ తరగతి వరకు పాఠ్యపుస్తకాలతోపాటు నోట్‌పుస్తకాలు అందజేయనున్నారు.

పుస్తకాలు బాగుంటున్నాయి



నాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం కాగా ముగ్గురి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నాను. పెద్దకుమార్తె ఈ ఏడాది 7వ తరగతి, చిన్నకుమార్తె ఐదవ తరగతి, కుమారుడు రెండవ తరగతి చదవనున్నారు. విద్యార్థులకు ఇచ్చే పుస్తకాలు చాలా బాగుంటున్నాయి. మొదటి రోజే పుస్తకాలు ఇస్తే విద్యార్థులకు శ్రద్ధతో చదువుకుంటారు.

– లింగమయ్య, కోవెలకుంట్ల

విద్యాకానుక వరం



ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులను కల్పించింది. విద్యాకానుక పేద విద్యార్థులకు వరంగా మారింది. మాకు ఇద్దరు కుమార్తెలు సంతానం. ఇద్దరిని కోవెలకుంట్ల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చదివించాం. గత విద్యా సంవత్సరం పెద్ద కుమార్తె నిత్యానందరెడ్డి పదవ తరగతిలో 520 మార్కులు సాధించి ప్రస్తుతం నంద్యాలలో డిప్లొమో చదువుతోంది. చిన్న కుమార్తె ఉషశ్రీ ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి చదవాల్సి ఉంది.

– లావణ్య, విద్యార్థిని తల్లి, కోవెలకుంట్ల

చక్కటి విద్య అందుతోంది



ఒకప్పుడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలంటే భయపడేవాళ్లం. 2019వ సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన విద్య అందుతోంది. నా పెద్ద కుమార్తె పర్వీన్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆరవ తరగతి పూర్తి చేసుకుని ఈ విద్యా సంవత్సరం ఏడవ తరగతి చదవాల్సి ఉంది. పాఠ్యపుస్తకాలు మొదలుకొని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

– మహబూబ్‌బాషా, విద్యార్థిని తండ్రి, కోవెలకుంట్ల

మొదటి రోజే అందజేస్తాం



మండలంలో 26 ప్రాథమిక, రెండు ప్రాథమికోన్నత, ఎనిమిది ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాల లకు సంబంధించి జిల్లా స్టాక్ పాయింట్ నుంచి పాఠ్యపుస్తకాలు సరఫరా అయ్యాయి. వచ్చే నెల 12వ తేదీ పాఠశాలలు పున:ప్రారంభమయ్యే రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యాకానుక కిట్లను అందజేస్తాం.

– వెంకటరామిరెడ్డి, ఎంఈఓ, కోవెలకుంట్ల

పారదర్శకంగా ఓట్ల లెక్కింపు

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు, చిత్రంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డితో కలిసి కౌంటింగ్ నిర్వహణ ఏర్పాట్లపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ నంద్యాల పట్టణ శివారు ప్రాంతంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉన్న సందర్భంగా ప్రాధాన్యత క్రమంలో ఎన్నికల కమిషన్ తాజా నిబంధనల మేరకు గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు కౌంటింగ్ కేంద్రంలో అనుమతించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ హాలులో ప్రతి రౌండ్‌కు ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయనే సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రదర్శించేందుకు వీలుగా బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

☛ జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా అంతటా 144వ సెక్షన్ అమలులో ఉంటుందని, ఎలాంటి హింసాత్మక సంఘటనలకు అవకాశం ఇవ్వకుండా ప్రశాంత కౌంటింగ్‌కు రాజకీయ పార్టీలు తమ పూర్తి సహకారాన్ని అందించాలన్నారు. అధికారిక పాసులు ఉన్న వ్యక్తులను మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రం సమీపంలోని కేశవరెడ్డి స్కూలు, కస్తూర్బా పాఠశాలల్లోని మైదానాల్లో పార్కింగ్ కోసం ఏర్పాటు చేశామన్నారు. సోషల్ మీడియాలో అనవసర పోస్టులు పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ అనంతరం 72 గంటల పాటు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్ఓ పద్మజ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో తాత్కాలిక జనరల్ సీనియారిటీ జాబితా

కర్నూలు సిటీ: జిల్లాలోని మున్సిపల్ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో సెకండ్ గ్రేడ్ టీచర్లు, భాషా పండితులుగా పని చేస్తున్న వారికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు తయారు చేసిన తాత్కాలిక జనరల్ సీనియారిటీ జాబితా డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ కె.శామ్యూల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్‌లో సీనియారిటీ, వారి అర్హతల ఆధారంగా సబ్జెక్టులతో సహా వివరాలు పొందుపరిచామని, దీనిపై ఏవైన అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31వ తేదీలోపు తగిన ఆధారాలతో డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని డీఈఓ పేర్కొన్నారు.

ఎస్‌బీఐలో సర్వర్ సమస్య

కర్నూలు(అగ్రికల్చర్): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మంగళవారం లావాదేవీలు స్తంభించాయి. సర్వర్ సమస్య కారణంగా ఉదయం నుంచి లావాదేవీలు ముందుకు సాగకపోవడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు. ఎస్‌బీఐలో సర్వర్ సమస్య దేశ వ్యాప్తంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఎస్‌బీఐ బ్రాంచీల బయట బోర్డులు ఏర్పాటు చేసి ఖాతాదారులు సహకరించాలని కోరారు. బుధవారం ఉదయానికి సర్వర్‌ను రీస్టోర్ చేసేందుకు, యథావిధిగా లావాదేవీలు నిర్వహించేందుకు ఎస్‌బీఐ ఉన్నతస్థాయిలో ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక అధికారులు తెలిపారు.

30న మూడో తరగతి ప్రవేశాలకు లాటరీ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని మూడు ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 3వ తరగతి ప్రవేశాలకు సంబంధించి ఎస్టీ కేటగిరీ విద్యార్థులకు ఈ నెల 30న ఉదయం 11 గంటలకు లాటరీ నిర్వహిస్తున్నట్లు గిరిజన గురుకులాల కన్వీనర్ ప్రిన్సిపాల్ ఎ.లక్ష్మీగురప్ప తెలిపారు. కర్నూలు, ఆలూరులో బాలికలు, తుగ్గలి మండలం రాతనలో బాలురకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. స్థానిక బిర్లాగేట్ సమీపంలోని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో లాటరీ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులకు నోటీసులు

కర్నూలు(హాస్పిటల్): సిజేరియన్ ఆపరేషన్లు అధికంగా చేస్తున్న పలు ప్రైవేటు ఆసుపత్రులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ నోటీసులు జారీ చేశారు. ఆయా ఆసుపత్రులకు వచ్చిన మొత్తం ప్రసవ కేసుల్లో 85 శాతానికి పైగా సిజేరియన్లు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ జాబితాలో కర్నూలులోని గాయత్రి హాస్పిటల్, అమీలియో హాస్పిటల్, కేఎం హాస్పిటల్, సన్‌రైజ్ హాస్పిటల్, జీఎస్ఆర్ హాస్పిటల్‌లు ఉన్నాయి. ఆయా ఆసుపత్రులు వివరణను పరిశీలించిన అనంతరం చర్యలు తీసుకుంటామని ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ బందోబస్తు



వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పాణ్యం: జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ బందోబస్తు చేపడుతున్నట్లు ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఆర్జీఎం, శాంతిరామ్ ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతను తనిఖీ చేశారు. ఎన్నికల కౌంటింగ్ సమయం దగ్గర పడుతున్న సమయంలో సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆయన కౌంటింగ్ రోజు వాహనాల పార్కింగ్‌కు అనువైన ప్రదేశాలను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించి అధికారులు సూచనలు, సలహాలు ఇచ్చారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అనుమానాస్పదంగా ఎవరు కనిపించినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఫలితాలు వెలువడిన అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా పేల్చేందుకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. ప్రజలందరూ వివాదాలకు అల్లర్లకు దూరంగా ఉండాలన్నారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జిల్లా వ్యాప్తంగా పోలీసు పికెట్లు, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, టౌన్ డీఎస్పీ రవీంద్రనాథరెడ్డి, ఆర్మూడు రిజర్వ్ డీఎస్పీ శ్రీనివాసులు, నంద్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, పాణ్యం ఇన్‌స్పెక్టర్ నల్లప్ప ఉన్నారు.

సర్కారు కళాశాలకు వెళ్దాంరండి!

- ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు సైతం ప్రచారం
- ఈనెల 31వ తేదీ వరకు మొదటి విడత ప్రవేశాలు
- రెండో విడత జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు



తమ కళాశాలలో చేరండి అంటూ అవగాహన కల్పిస్తున్న బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది

నంద్యాల(న్యూటౌన్): ఉన్నత చదువులు అభ్యసించేందుకు కీలకమైన ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు విద్యార్థులు సమాయత్తమవుతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో ఫీజులు భయపెడుతున్న తరుణంలో మెరుగైన వసతుల మధ్య అనుభవం ఉన్న అధ్యాపకులతో ఉచిత విద్య అందించేందుకు తమ కళాశాలలు ఆహ్వానం పలుకుతున్నాయని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ, వివిధ సంక్షేమ శాఖల పరిధిలోని కళాశాలల్లో ప్రవేశాలు పెంపుదలకు ఇంటర్మీడియెట్ విద్యాశాఖ కృషి చేస్తోంది. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల తల్లిదండ్రులను కలసి తమ కళాశాలలో కోర్సులు, సీట్ల వివరాలతో పాటు గతంలో సాధించిన ఫలితాలను వివరిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 31 వరకు మొదటి విడత ప్రవేశాలు కల్పించడంతో పాటు జూన్ 1 నుంచి తరగతులు నిర్వహించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు కార్యాచరణ చేపట్టింది. ఈ క్రమంలో రెండో విడత ప్రవేశాలు జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు చేపట్టనున్నారు. గ్రామాల్లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ కళాశాలల్లో ఉన్న వసతులపై వివరిస్తున్నారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు కళాశాల పనివేళల్లో వచ్చి దరఖాస్తు చేసుకుని నేరుగా ప్రవేశాలు పొందవచ్చు. దరఖాస్తుతో పాటు అవసరమైన సర్టిఫికెట్లు, జిరాక్స్, ఆధార్ కార్డులు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ తీసుకురావాల్సి ఉంటుంది.

మెరుగైన సౌకర్యాలు..


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో విద్యావ్యవస్థను ఎంతో మెరుగుపరిచారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుతం ప్రతి కళాశాలలో అనుభవం కలిగిన అధ్యాపకులు, విశాలమైన తరగతి గదులు, అధునాతన ప్రయోగశాలలు, క్రీడాస్థలం మంచినీటి వసతి, మరుగుదొడ్లు ఉన్నాయి. వాటితో పాటు బస్ పాస్ సౌకర్యం, హాస్టల్ వసతి, స్టడీ అవర్స్ నిర్వహణతో పాటు విద్యార్థుల్లో సేవా భావం పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.



నంద్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల

జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు..	
ప్రభుత్వ కళాశాలలు	18
మోడల్ కళాశాలలు	19
కేజీబీవీలు	27
సోషల్ వెల్ఫేర్	6
ట్రైబల్	3
బీసీ వెల్ఫేర్	3
హైస్కూల్ ప్లస్	5
ప్రైవేటు కళాశాలలు	57

అవగాహన కల్పిస్తున్నాం



కళాశాలలో అడ్మిషన్ల పెంపునకు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. ప్రతి రోజూ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారికి కళాశాలలో వసతుల గురించి వివరించడంతో పాటు కళాశాలలో చేరే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. కోర్సుల వివరాలు, సీట్ల సంఖ్య తదితర వాటిపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు వివరిస్తున్నాం.

– చక్రధర్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, నంద్యాల

జూన్ 1 నుంచి తరగతులు



ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో కళాశాలల్లో సీట్లు పెంపుదలకు కృషి చేస్తున్నాం. ఇప్పటికీ అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులకు దిశానిర్దేశం చేశాం. ఈ ఏడాది తరగతులు జూన్ 1 నుంచి ప్రారంభం కానున్నాయి. అన్ని కళాశాలల్లో రెండు విడతలుగా అడ్మిషన్లు చేపడుతున్నాం. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సునిత, డీఐఈఓ, నంద్యాల

క్లుప్తంగా

నేడు ఐదో తరగతిలో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్

కర్నూలు(అర్బన్): 2024–25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో మిగిలిన 26 సీట్ల భర్తీకి బాలికలకు ఈ నెల 29న స్థానిక దిన్నెదేవరపాడు స్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీట్ల భర్తీకి ఎస్‌సీ విద్యార్థులు 20 నుంచి 19 మార్కుల వరకు, ఎస్‌టీ అభ్యర్థులు 19 నుంచి 18 మార్కుల వరకు, బీసీలు 44 నుంచి 43 మార్కుల వరకు, ఓసీ అభ్యర్థులు 35 నుంచి 34 మార్కులు సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఈ నెల 27న వెయిటింగ్ జాబితాలో ఉన్నవారు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. వీరికి సీటు కేటాయించిన అనంతరమే ప్రతిభ ఆధారంగా మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. కౌన్సెలింగ్ 1:3 నిష్పత్తిలో ఉంటుందని, హాజరైన ప్రతి ఒక్కరికీ సీట్లు లభించే అవకాశం లేదని ఆమె స్పష్టం చేశారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి


శ్రీనివాసులు (ఫైల్)

దేవనకొండ: మండలకేంద్రం దేవనకొండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు శ్రీనివాసులు(45) మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. డ్యూటీ ముగించుకుని ఉదయం 6 గంటల సమయంలో ఇంటికి చేరుకున్న తర్వాత ఛాతిలో నొప్పి వస్తుందని భార్యకు చెప్పి కుప్పకూలి పడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు దేవనకొండ ప్రాథమిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. విషయం తెలియగానే సీఐ శ్రీనివాసులు హోంగార్డు కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


రాజశేఖర్(ఫైల్)

మంత్రాలయం: మండల పరిధిలోని సూగూరు గ్రామంలో మంగళవారం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలివి.. గ్రామానికి చెందిన చాకలి పరుశురామ్, లక్ష్మీ దంపతుల రెండవ కుమారుడు రాజశేఖర్ (21) అనే యువకుడు ఇంట్లో పశువులకు మేత వేయడానికి వెళ్లాడు. పశువుల వెనుక భాగం నుంచి మేత వేస్తుండగా గోడకు ఉన్న కడ్డీకి ఎడమ భుజం తాకింది. అప్పటికే కడ్డీకి విద్యుత్ ప్రసారం కావడంతో షాక్‌కు గురైయ్యాడు. ఎవరు చూసుకోకపోవడంతో అక్కడే ప్రాణాలు వదిలాడు. మధ్యాహ్న సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. చేతికొచ్చిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు చూపరులను కంటతడి పెట్టించింది.

నిందితులకు జైలు శిక్ష

నంద్యాల (వ్యవసాయం): వివిధ కేసుల్లో మంగళవారం పలువురు నిందితులకు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి జైలుశిక్ష విధించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బిల్లలాపురంకు చెందిన మంజుల ఆంజనేయులు, వెలుగోడు మండలం మోతుకూరు గ్రామానికి చెందిన మోతే రామకృష్ణ, నంద్యాల మండలం జ్ఞానాపురానికి చెందిన సామెల్ మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు చిక్కారు.అలాగే నంద్యాలలోని సంగపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ప్రబలుతున్న అతిసారం

- గ్రామాల్లో అధికమవుతున్న కేసులు
- ఆహారం, తాగునీరు కలుషితం కావడమే కారణం
- వైద్యుల వద్దకు క్యూ కడుతున్న రోగులు
- ఇంటితో పాటు పరిసరాల పరిశుభ్రత ముఖ్యం
- పట్టణాల్లోనూ వెలుగు చూస్తున్న కేసులు

పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలకు తోడు ఆకస్మికంగా కురుస్తున్న వర్షాలకు తాగునీరు, ఆహారం కలుషితమై జిల్లాలో అతిసార ప్రబలుతోంది. ఇటీవల కాలంలో వైద్యుల వద్దకు ఇలాంటి కేసులు ఎక్కువగా వస్తున్నాయి. పల్లెలతో పాటు పట్టణాల్లోనే బాధితులు పెరుగుతున్నారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కలుషిత నీరు, ఆహారానికి దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. – కర్నూలు(హాస్పిటల్)

సాధారణంగా లూజు లేదా నీళ్ల బేదులు అని పిలవబడే అతిసార వ్యాధి (డయేరియా) జీర్ణవ్యవస్థ మార్గానికి సంబంధించిన రుగ్మత. ఒక వ్యక్తి ఒక రోజులో మూడు లేదా అంతకుమించిన సార్లు ద్రవ లేదా నీళ్ల బేదులు చేస్తే అతిసార వ్యాధి ఉన్నట్లు చెబుతారు. ఇది వైరస్‌లు, బ్యాక్టీరియా, పరాన్నజీవులతో కలుగుతోంది. సాధారణంగా ఇది కలుషితమైన నీటిని తాగడం, ఆహారాన్ని తినడం ద్వారా వస్తుంది. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత లేమి ఇందులో ముఖ్యపాత్ర పోషిస్తాయి. అతిసార వల్ల శరీరంలోని లవణాలు కోల్పోయి మనిషికి నిస్సత్తువ ఆవరిస్తుంది. సకాలంలో చికిత్స చేయకపోతే కొన్నిసార్లు ఇది ప్రాణాపాయానికి దారి తీస్తుంది. ముఖ్యంగా వేసవిలో వర్షాలు కురిసి తాగునీరు కలుషితం అవుతోంది. దీంతో పాటు ఆహారం సైతం కలుషితం కావడంతో ప్రజలు డయేరియాకు గురవుతున్నారు. జిల్లాలో గత మూడు వారాల నుంచి అతిసార కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోని మురికివాడలు, గ్రామీణ ప్రాంతాల్లో ఈ కేసులు ఎక్కువగా ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లకు ఒక్కొక్క చోట 10 దాకా అతిసార కేసులు చికిత్స కోసం వస్తున్నాయి. ఇటీవల కల్లూరు పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో, తాజాగా పెద్దహరివాణం పీహెచ్‌సీ పరిధిలోని ఇస్వి గ్రామంలో పలువురికి అతిసార ప్రబలినట్లు నమోదు అయ్యాయి. గతేడాది హోళగుంద పీహెచ్‌సీ పరిధిలోని నెరణికి గ్రామంలో, ఓర్వకల్‌లో పలువురు అతిసార బారిన పడ్డారు.

అతిసారం లక్షణాలు

- పొత్తికడుపు పిండివేసినట్లు ఉండటం
- కడుపునొప్పి, • పొత్తికడుపు ఉబ్బుట
- దప్పిక ఎక్కువగుట, • బరువు తగ్గుట
- జ్వరము, • కడుపులో వికారం
- ఆకస్మికంగా వెంటనే మలవిసర్జనకు వెళ్లాలనే ఆతృత, • లూజు బేదులు
- మలంలో రక్తం ఉండటం
- ఎడతెగని వాంతులు



ఎప్పుడు డాక్టర్‌ను కలవాలంటే...

- రెండు రోజులకు మించి బేదులు ఉంటే
- నిర్జలత్వము చిహ్నాలను గమనించి ఉంటే
- పొత్తికడుపు లేదా మలద్వారంలో తీవ్రంగా నొప్పి ఉంటే
- మలము నల్లగా లేదా రక్తముతో కూడి ఉంటే
- 102 డిగ్రీల ఫారన్‌హీట్ కంటే ఎక్కువ జ్వరం ఉంటే

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా అతిసారను త్వరగా పరిష్కరించవచ్చు. భవిష్యత్‌లో రాకుండా నివారించవచ్చు. వీటిలో ఈ కింది సూచనలు పాటించాలి.

- బాత్‌రూమ్‌ను ఉపయోగించిన తర్వాత సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి
- వంటచేసే ముందు, వంట చేసిన తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలి. డైపర్స్ మార్చిన తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలి
- మరిగించిన లేక బాటిల్‌లోని ప్యూరిఫైడ్ నీటిని తాగాలి
- వేడిగా ఉన్న పానియాలను తాగాలి
- శిశువులకు, చిన్నపిల్లలకు వయస్సుకు తగిన ఆహారం ఇవ్వాలి
- ఆరు నెలల వరకు తల్లిపాలను తప్పనిసరిగా ఇవ్వాలి
- ఆహారాన్ని సక్రమంగా నిల్వ చేయాలి

అతిసారం చికిత్స

- సాధారణంగా విరేచనాలకు మందుల దుకాణాల్లో విక్రయించే మందులతోనే నయం అవుతుంది. అయితే రక్తవిరేచనాలు, అతిసారంతో పాటు జ్వరం కలిగిన ప్రజలు వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి.
- చిన్నపిల్లల్లో తీవ్రమైన అతిసార వ్యాధికి మందుల దుకాణాల్లో అమ్మే మందులతో చికిత్స చేయడం ప్రమాదకరం. ప్రత్యేకంగా శిశువులు, చిన్నపిల్లల వైద్యులను కలిసి చికిత్స చేయించాలి.
- కొన్నిరకాల బ్యాక్టీరియా సహిత అతిసారకు యాంటిబయాటిక్ మందులు తప్పనిసరిగా వాడాల్సి ఉంటుంది. వీటితో పాటు క్రోన్, అల్సెరేటివ్ కొలైటిస్, ఇర్రిటబుల్ బవల్ సిండ్రోమ్ వల్ల వచ్చే అతిసారకు వైద్యులు నిర్దిష్టమైన మందులు సూచిస్తారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము



అతిసార ప్రబలిన ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నాము. అతిసారకు గురైన వారికి చికిత్స అందించడంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాము. దీంతో పాటు ప్రతి పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో ఓఆర్‌ఎస్ ద్రావణం ప్యాకెట్లను అందుబాటులో ఉంచాము. ఎవ్వరైనా వీటిని ఉచితంగా తీసుకుని వెళ్లి వాడుకోవచ్చు. వేసవిలో వచ్చే డీహైడ్రేషన్ దృష్ట్యా వీటిని బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు తదితర ప్రాంతాల్లోనూ ఉంచి ఉచితంగా అందజేస్తున్నాము. ప్రజలు కలుషితంగా ఉండే నీరు, ఆహారానికి దూరంగా ఉండాలి. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తినకూడదు. వేడిగా ఉన్న ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి.

–డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్‌వో, కర్నూలు

అతిసారను ఇలా నివారించవచ్చు

ఇంట్లో తయారైన ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని కానీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో, మెడికల్ దుకాణాల్లో లభించే ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని గానీ తాగాలి. ఇది శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి ఇస్తుంది. అతిసార వ్యాధికి చాలా వరకు ఇదే ఉత్తమ చికిత్సగా వైద్యులు పేర్కొంటారు. చిన్నారులకు అతిసార రాకుండా ఉండేందుకు వైద్యులు విటమిన్ మందులను సూచిస్తారు. ఓరల్ రోటా వైరస్ టీకా వల్ల కూడా అతిసార సంబంధిత వ్యాధులను నివారించవచ్చు.

వంద శాతం నాణ్యతతో వేరుశనగ

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు సబ్సిడీపై పంపిణీ చేసే వేరుశనగ వంద శాతం నాణ్యతతో అందిస్తామని ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన కర్నూలులో వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్లను తనిఖీ చేశారు. కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేటులోని ఏపీసీడ్స్, శివసాయి సీడ్స్, శ్రీకృష్ణ సీడ్స్‌ల్లో వేరుశనగ ప్రాసెసింగ్, నాణ్యతను పరిశీలించారు. ఏపీ సీడ్ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ నాణ్యతను అన్ని విధాల పరిశీలించిన తర్వాతనే ఆర్‌బీకేలకు తరలించాలన్నారు. నాణ్యతపై రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేవన్నారు. ప్రభుత్వం అనుమతిస్తే ఆదనంగా వేరుశనగ సరఫరాకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఖరీఫ్‌లో ఏపీసీడ్స్ ద్వారా వేరుశనగ, వరి, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు, కందులు తదితర విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఆయన వెంట ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ ధనలక్ష్మి, ప్రాసెసింగ్ యూనిట్ల ఇన్‌చార్జీలు ఉన్నారు.


వేరుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న ఏపీసీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్, చిత్రంలో జిల్లా మేనేజర్ ధనలక్ష్మి

ధాన్యం వ్యాపారి అరెస్టు

చాగలమర్రి: రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి డబ్బు చెల్లించకుండా పరారీలో ఉన్న వ్యాపారి గోడిగనూరు గ్రామానికి చెందిన టంగుటూరి నిఖిల్, అతని తల్లిదండ్రులు టంగుటూరి శ్రీదేవి, టంగుటూరు సురేష్‌లను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నిందితులు మండలానికి చెందిన రైతుల వద్ద మార్కెట్ కంటే అధిక రేటు ఆశ చూపి ధాన్యం కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన రూ.1.24 కోట్లు చెల్లించకపోగా మరికొందరు వద్ద వడ్డీకి కోటిరూపాయలు తీసుకొని పరారయ్యారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఏప్రిల్ 1న చీటింగ్ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో నిందితులు అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో బంధువుల ఇంటి వద్ద ఉన్నట్లు తెలియడంతో మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చాగలమర్రి ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. మండలంలోని రైతులు అప్రమత్తంగా ఉండాలని ముందుగా వ్యాపారులు డబ్బు చెల్లిస్తేనే ధాన్యం విక్రయించాలని సూచించారు.


నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన చాగలమర్రి ఎస్‌ఐ రమణయ్య, సిబ్బంది

విద్యాదీవెన అమలుపై పరిశీలన

కర్నూలు (అర్బన్) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న విద్యా దీవెన వివిధ కళాశాలల్లో అమలు తీరుపై అధికారులు పరిశీలన చేపట్టారు. మంగళవారం సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రంగలక్ష్మీదేవి స్థానిక జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లి విద్యాదీవెన పొందుతున్న విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు, హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జగనన్న విద్యా దీవెన పథకానికి సంబంధించి ఆయా కళాశాలల్లో 5 శాతం దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. 2021–22, 2022–23, 2023–24 విద్యాసంవత్సరాలకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నామన్నారు. పరిశీలించిన నివేదికలను జ్ఞానభూమి లాగిన్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతుందన్నారు. తనతో పాటు ఫీల్డ్ లెవల్ ఆఫీసర్లు, క్లస్టర్ ఆఫీసర్లు కూడా కళాశాలలకు వెళ్లి జేవీడీపై పరిశీలించాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకు యాజమాన్యాలు సహకారం అందించాలని కోరారు.


పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో దరఖాస్తులను పరిశీలిస్తున్న జేడీ రంగలక్ష్మీదేవి

ఆ పత్తి విత్తనాలను సాగుకు వినియోగించొద్దు

- సీజ్ చేసిన బీటీ పత్తి విత్తనాలను పరిశీలించిన ప్రత్యేక టీమ్

కర్నూలు(అగ్రికల్చర్): 2020లో సీజ్ చేసిన 10000 కిలోల ఇమేజ్ క్రాఫ్ సైన్స్‌కు చెందిన బీటీ పత్తి విత్తనాలను సాగుకు వినియోగించొద్దని, వాటిని ధ్వంసం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం సీజ్ చేసిన విత్తనాలు ఏ విధంగా ఉన్నాయి... వాటిని ఎలా ధ్వంసం చేయాలి తదితర వాటిని పరిశీలించేందుకు కర్నూలు ఏడీఏ సాలురెడ్డి నేతృత్వంలో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశారు. ఈ టీమ్ మంగళవారం విత్తనాలను పరిశీలించింది. 2020లో కో-మార్కెటింగ్ లేకపోయినప్పటికీ ఇమేజ్ క్రాప్ సైన్స్ శ్రీరామ సీడ్స్ ద్వారా రైతులకు పంపిణీ చేసేందుకు రూ.1.60 కోట్ల విలువ చేసే 10 వేల క్వింటాళ్లు సిద్ధం చేసింది. అయితే విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి ఈ స్టాక్‌ను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ జరిపిన జిల్లా కలెక్టర్ విత్తనాల విలువలో 40 శాతం జరిమానా చెల్లించాలని ఆదేశించారు. దీనిపై విత్తన కంపెనీ కోర్టును ఆశ్రయించడంతో కలెక్టర్ ఆదేశాలను రద్దు చేసింది. కోర్టు ఆదేశాలతో స్టాకు విడుదలకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. విత్తనాలు సీజ్ చేసి నాలుగేళ్లు అయినందున సాగుకు పనికిరావని, ధ్వంసం చేయాలని వ్యవసాయ శాఖ ఆదేశాలు ఇచ్చింది. కొద్ది నెలల క్రితమే కల్లూరు ఏఓ ఈ స్టాకులో 500 కిలోలు కాల్చివేశారు. తాజాగా మిగిలిన విత్తనాలను ఏడీఏలు సాలురెడ్డి, గిరీష్, డీఆర్‌సీ ఏఓ శశిధర్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ల?


సీజ్ చేసిన బీటీ విత్తనాలను పరిశీలిస్తున్న ఏడీఏలు సాలురెడ్డి, గిరీష్ తదితరులు

నగేశ్.. శభాష్!

- మానవత్వం చాటుతున్న ఆటోవాలా
- గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగులకు తన ఆటోలో ఉచితం
- వన్యప్రాణుల ఆకలి దప్పిక తీర్చే ఆపద్బాంధవుడు
- అనాథ మృతులకు ఆత్మ బంధువు


మతిస్థిమితం లేని అనాథ వృద్ధురాలికి సేవలు చేస్తూ..


గర్భిణిని ఆటోలో ఉచితంగా ఆసుపత్రికి తీసుకువస్తూ ..

ఆళ్లగడ్డ: పక్కింట్లో వారికి ఏదైనా జరిగితే మనకెందుకులే అని పట్టించుకోని వారెందరో ఉన్నారు. సొంత బంధువులు కష్టాల్లో ఉన్నా పలుకరించని వాళ్లు ఉన్నారు. అయితే ఆళ్లగడ్డకు చెందిన నగేశ్ గురించి తెలుసుకుంటే మానవత్వం ఇంకే మిగిలే ఉందని చెప్పవచ్చు. అభాగ్యులకు ఆపద్బాంధవుడిగా.. అనాథ మృతులకు ఆత్మబంధువుగా.. మూగజీవాలకు ఆకలితీర్చే మంచి మనస్సు ఉన్న యువకుడిగా అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ఆటోవాలా బిజ్జల నగేశ్ సంపాదన అంతంతమాత్రమే. రోజూ ఆటో నడిపితేగాని ఇంటిల్లిపాదికి కడుపు నిండదు. అయినా నగేశ్ మాత్రం తన పేదరికాన్ని కూడా లెక్క చేయకుండా తనకున్నంతలో సాటి మనుషులకు సాయం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. రోడ్డుపై ఎవరైనా గర్భిణులు నడుస్తూ కనిపిస్తే చాలు వారిని ఆసుపత్రికి అక్కడి నుంచి ఇంటికి తన ఆటోలో ఉచితంగా తీసుకెళుతున్నాడు. పట్టణంలోని ఏ ఆసుపత్రికైనా, దూర ప్రాంతాల్లో ఆస్పత్రులకు కాన్పు కోసం గాని, ఇతర అత్యవసర సేవల కోసం వెళ్లాల్సిన గర్భిణులు ఇప్పటి వరకు వందల మందిని ఉచితంగా తన ఆటోలో తీసుకెళ్లారు. అలాగే అనాథలు ఎక్కడ కనిపించినా వారిని కన్నవారిలా చూసుకుంటూ నిత్యం వారికి అవసరమైన అన్ని సమకూర్చుతూ సపర్యలు చేస్తుంటాడు. ఒకవేళ అనాథలు ఎవరైనా మృతి చెందితే సొంత ఖర్చులతో వారికి దగ్గరుండి అంత్యక్రియలు జరిపిస్తారు. మరణించినవారి మతం తెలిస్తే వారి మత సంప్రదాయ ప్రకారమే ఖర్మకాండలు తంతు పూర్తి చేయడం జరుగుతుంది. ఇప్పటివరకు సుమారు 50 అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు జరిపినట్లు నగేశ్ తెలిపారు. ఏటా వేసవిలో అహోబిలం కొండ ప్రాంతంలో చెట్లన్నీ ఎండిపోవడంతో పాటు కనీసం తాగడానికి కూడా నీళ్లు లేక చనిపోతున్న వానరాలను రక్షించేందుకు వారంలో మూడు, నాలుగు రోజులు ఆళ్లగడ్డ నుంచి 25 కి.మీ దూరంలో ఉన్న అహోబిలం అడవిలోకి పండ్లు, నీళ్లు తీసుకుపోయి అక్కడ ఉండే కోతులకు అందిస్తారు. మూగజీవాల ఆకలి తీర్చడం కోసం తన సంపాదన సరిపోక ఆళ్లగడ్డ కూరగాయలు, పండ్ల మార్కెట్‌లలో గ్రేడింగ్ చేసిన వాటిని సేకరించి ఇలా కోతులకు అందిస్తున్నారు. ఆకలితో బాధపడే వారికి భోజన ఏర్పాట్లు చేస్తుంటారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి మతి స్థిమితంలేని అన్న, వృద్ధురాలైన అమ్మతో ఎన్నో కష్టాలు పడ్డామని అభాగ్యులకు సేవలందించడం అంటే ఆ దేవుడికి సేవ చేసినట్లేనని నగేశ్ చెబుతున్నారు.

ఆదోని సబ్ రిజిస్ట్రార్‌పై విచారణ

ఆదోని రూరల్: లోకాయుక్త చీఫ్ జస్టిస్ లక్ష్మణ్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదోని సబ్ రిజిస్ట్రార్ రాజశేఖర్ అధికార దుర్వినియోగంపై మంగళవారం జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరరావు విచారణ చేపట్టారు. పర్వతాపురం గ్రామానికి చెందిన సర్వేనం. 134–4, 128–3లోని 1.21 ఎకరాలు ఉంది. కోట్ల రూపాయలు చేసే ఈ భూమికి తక్కువ విలువ కట్టి రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టినట్లు బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. దీనిపై చీఫ్ జస్టిస్ తనను విచారణకు ఆదేశించారని, పూర్తి నివేదికను ఆయనకు సమర్పిస్తానని జిల్లా రిజిస్ట్రార్ వెల్లడించారు.

తీర్థయాత్రకు వెళ్లి.. కొండజుటూరు వాసి మృతి

పాణ్యం: అయోధ్య దర్శనానికి వెళ్లి ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందాడు. మండలంలోని కొండజుటూరు గ్రామానికి చెందిన సుమారు 50 మంది ఈనెల 21వ తేదీన అయోధ్యకు వెళ్లారు. వీరిలో ఒకరైన వెంకటరమణ (57) మంగళవారం అక్కడ శ్రీరాముడిని దర్శించుకుని బయటకు వచ్చిన తర్వాత తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆయనను ఆటోలో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందాడు. పాలూరు గ్రామంలో హెయిర్‌స్టైల్ దుకాణం నిర్వహించే మృతుడికి కుమారుడు, ముగ్గురు కుమార్తెలు సంతానం. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ఆర్థికంగా సహకరించాలని వెంకటరమణ కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా కోరారు.

వైద్యారోగ్య సిబ్బందిపై కేసు నమోదు

చాగలమర్రి: మండలంలోని మల్లేవేముల గ్రామ హెల్త్ క్లినిక్ సిబ్బంది కె.మంజులమ్మ, బి.భాగ్యలక్ష్మిపై మంగళవారం కేసు నమోదైంది. ఒకరినొకరు అసభ్య పదజాలంతో దూషించుకొని ఫిర్యాదు చేసుకోవడంతో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. భాగ్యలక్ష్మి ఎంఎల్‌హెచ్‌పీగా క్లినిక్‌లో విధులు నిర్వహిస్తుండగా గ్రేడ్-3 ఎఎన్‌ఎంగా మంజులమ్మ పనిచేస్తున్నారు.

ప్రతిభా పురస్కారాలకు ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జూన్ 2వ తేదీ ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని బలిజ, కాపు సేవాసమితి వ్యవస్థాపకుడు దండే దస్తగిరి తెలిపారు. ఏటా విద్యార్థులను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. 70 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నట్లు సమితీ అధ్యక్షుడు కొప్పుల సుబ్బారెడ్డి తెలిపారు. జూన్ 2వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లోని రావూస్ గర్ల్స్ క్యాంపస్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వివరాలకు 9700707987 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న సెబ్ దాడులు

కర్నూలు : మద్యం, నాటుసారా, ఇసుక అక్రమ రవాణాపై సెబ్ దాడులు కొనసాగుతున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆదేశాల మేరకు సెబ్ అధికారులు జిల్లా వ్యాప్తంగా మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో 7 సెబ్ స్టేషన్లు, 7 చెక్ పోస్టులు ఉన్నాయి. వాటి పరిధిలో తనిఖీలు నిర్వహించి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఆరుగురిపై కేసులు నమోదు చేసి 32 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. ఆరు ట్రాక్టర్లను జప్తు చేసి రూ.62 వేలు అపరాధ రుసుం విధించి ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు. అలాగే సుంకం చెల్లించకుండా పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లాలోకి అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వారిపై నిఘా ఉంచి ఏడు కేసులు నమోదు చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 1,734 మద్యం బాటిళ్లు, ఒక ఆటోను సీజ్ చేశారు. అలాగే సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి 2,850 లీటర్ల ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ఆ ముగ్గురు హత్యనా.. ఆత్మహత్యనా?

- తల్లి, కూతురు, బాలుడు అనుమానాస్పద మృతి
- కొప్పళ తాలూకా హొసలింగాపురంలో ఘటన
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు


తల్లి, కుమార్తె, మనవడు (ఫైల్)

సాక్షి బళ్లారి: కొప్పళ తాలూకా హొసలింగాపుర గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అనుమానాస్పదంగా మృతి చెందారు. మృతుల్లో రాజేశ్వరి (45), ఆమె కుమార్తె వసంత (22), మనవడు సాయి(4) ఉన్నారు. వసంతకు ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలకు చెందిన ఓ వ్యక్తితో వివాహమైంది. ఆమె రెండేళ్ల నుంచి భర్తకు దూరంగా ఉంటూ హొసలింగాపుర గ్రామంలో ఓ ఇంటిని బాడుగకు తీసుకొని జీవిస్తోంది. వసంతకు వేరే మతానికి చెందిన వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందనే ఆరోపణలున్నాయి. ఓ ఫ్యాక్టరీలో పని చేస్తూ వసంత కుటుంబాన్ని పోషిస్తోంది. ఏం అయిందో ఏమో తెలియదు కానీ మంగళవారం ఉదయం పడక గదిలో ముగ్గురు మృతిచెంది ఉన్నారు. ఆత్మహత్య చేసుకున్నారా? లేక హత్యకు గురయ్యారా? అని కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.